క్లుప్తంగా

బెస్ట్ బ్లడ్ మోటివేటివ్ అవార్డు ప్రదానం



తేజేశ్వరరావును అభినందిస్తున్న ఆదిత్య కళాశాల ఏడీ నాయుడు

బాలాజీచెరువు: స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో తేజేశ్వరరావుకు ఆంధ్రప్రదేశ్ రెడ్‌క్రాస్ సొసైటీ బెస్ట్ బ్లడ్ మోటివేటివ్ అవార్డు ప్రదానం చేసింది. రెడ్‌క్రాస్‌లో అత్యధిక సేవలు అందించిన వారికి ఏపీ రెడ్‌క్రాస్ ద్వారా గుంటూరు విద్యాభవన్‌లో అవార్డులు ప్రదానం చేశారు. తలసేమియా రోగుల కోసం ఆదిత్య విద్యా సంస్థల ద్వారా 2023లో 1,440 యూనిట్లు, 2024లో 4,100 యూనిట్ల రక్తాన్ని సేకరించి అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య శాఖ మంత్రి నుంచి తేజేశ్వరరావు అవార్డు స్వీకరించారు. సోమవారం కళాశాలలో ఆయన్ని ఏడీ బీఈవీఎల్ నాయుడు సత్కరించి మాట్లాడారు. 22 సార్లు రక్తదానం చేయడంతో పాటు అందరినీ చైతన్యపరుస్తూ రక్తదాన ఆవశ్యకత తెలియజేస్తున్న తేజేశ్వరరావును ప్రతి ఒక్కరూ అభినందించాలన్నారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం కోసం ఒక కాల్ చేస్తే తక్షణం స్పందించి విద్యార్థులను పంపిస్తారన్నారు.


నిత్యావసర సరకుల పంపిణీ



రమణయ్యపేటలో నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయం వద్ద లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో సోమవారం పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు ప్రసూన మాట్లాడుతూ మాట్లాడుతూ తమ క్లబ్ సభ్యురాలు నాగిరెడ్డి లక్ష్మి సహకారంతో వృద్ధాప్యంలో ఉన్నవారికి, పేదలకు నిత్యావసర సరకులు అందజేశామన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రతి నెలా సరకులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఆధ్యాత్మికవేత్త శిరీష, ఎంవీ శాస్త్రి, అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, బుద్ధరాజు సత్యనారాయణరాజు, ప్రసాద్ నాయుడు, కృష్ణమోహన్, శ్రీలక్ష్మి, తులసి తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



కుమారారామ భీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో కుమారారామ భీమేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. జేష్ఠ మాసం, పంచమి కావడంతో ఆలయంలో స్వామి, అమ్మవార్లకు, ఉప ఆలయాల్లోనూ అర్చకులు పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి తొలి అభిషేకం తిలకించడానికి క్యూలో వేచి ఉన్నారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కరణిలో నీటితో స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. భక్తులకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఉదయం పులిహోర, మధ్యాహ్న అన్నప్రసాదం, సాయంత్రం శెనగలు, పులిహోర ప్రసాదంగా పంపిణీ చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, అళ్లకి రాజ్‌గోపాల్, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబులు పూజాదికాలు నిర్వహించారు. అదే విధంగా స్థానిక మఠంసెంటర్‌లోని రామలింగేశ్వర స్వామి ఆలయం, నవరలో మల్లికార్జున స్వామి ఆలయం, గొంచాల, పీబీ దేవంలోని శివాలయాల్లో పూజలు నిర్వహించారు.

సారా బట్టీలపై దాడులు



కొత్తమూలపేటలో బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్సై వెంకటేష్

కొత్తపల్లి: కొత్తమూలపేట శివారు జీడితోటలో సారా తయారు చేస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై వెంకటేష్ సోమవారం తన సిబ్బందితో కలసి దాడులు చేశారు. సారా తయారీకి ఉపయోగించే సుమారు నాలుగు వందల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి ఉపయోగించే సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. నాటు సారా తయారు చేయడం, విక్రయించడం నేరమని ఎస్సై అన్నారు. సారా విక్రయాలు జరిగితే ప్రజలు సమాచారం అందించాలని కోరారు. సారా విక్రయాలను పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు పోలీసులకు సహకరించాలన్నారు.

నింగి నుంచే నిఘా



ఎస్.అచ్యుతాపురం వద్ద నిర్మానుష్య ప్రాంతంలో డ్రోన్ కెమెరాతో తీసిన చిత్రం



డ్రోన్ విజువల్స్‌ను నేరుగా పరిశీలిస్తున్న ఇంద్రపాలెం ఎస్సై వీరబాబు

- నిర్మానుష్య ప్రదేశాలపై డ్రోన్ కెమెరాలతో పరిశీలన
- గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు
- అసాంఘిక కార్యక్రమాల అడ్డుకట్టకు చర్యలు

కాకినాడ రూరల్: రోజురోజుకూ అసాంఘిక కార్యకలాపాలు పెచ్చుమీరుతున్నాయి.. రాత్రీ లేదు పగలూ లేదు దొంగతనాలు పెరిగిపోతున్నాయి.. గంజాయి విక్రయాలు చాపకింద నీరులా సాగిపోతున్నాయి.. జూద క్రీడలు జోరుగా జరుగుతున్నాయి. వీటికి గ్రామీణ ప్రాంతాలే వేదికలవుతున్నాయి.. అలాంటి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ఇంద్రపాలెం పోలీసులు నిఘా నేత్రాలకు పని చెబుతున్నారు. నింగి నుంచే నిఘా నేత్రంతో పరిశీలిస్తున్నారు. కాకినాడ రూరల్ ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చీడిగ వంతెన, కొవ్వూరు తదితర ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్టు సమాచారం ఉండడంతో పోలీసులు డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట పడేలా గ్రామాల్లో జల్లెడ పడుతున్నారు. గంజాయి విక్రయాలు, జూదం, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే వారి పనిపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అపరిచిత వ్యక్తుల సంచారంపై నిఘాకు గ్రామాల్లో ప్రధాన కూడళ్లు, వాణిజ్య సముదాయాల వద్ద సీసీ కెమోరాలు ఏర్పాటు చేయిస్తున్నారు. ఇంద్రపాలెం పీఎస్ పరిధిలోని నగరంలోని ముత్తానగర్, మధురానగర్, ఎస్.అచ్యుతాపురంతో పాటు ఇంద్రపాలెం, చీడిగ, తూరంగి, కొవ్వూరు, కొవ్వాడ, గంగనాపల్లి, రేపూరు తదితర ప్రాంతాలు ఉన్నాయి. ఇందులో తూరంగి పరిధి పగడాలపేట, మహాలక్ష్మి నగర్‌తో పాటు ఇంద్రపాలెంలో చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇటీవల తూరంగిలో ఓ ఇంట్లో దొంగలు పడి విలువైన బంగారు ఆభరణాలు దోచుకుపోయారు. ఇప్పటికి నేరస్తులను పోలీసులు గుర్తించలేకపోయారు. తూరంగి పరిధిలో సమస్యాత్మక ప్రాంతాలు కూడా ఉండడంతో ఇక్కడ ఒక్కోసారి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అందుకే అలాంటి ప్రదేశాలపై దృష్టి సారిస్తున్నారు.

గంజాయి... ఎంజాయ్

చీడిగ వంతెన, కొవ్వూరు తదితర ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్టు ప్రజల నోట వినిపిస్తుంది. గంజాయి బ్యాచ్ కాకినాడ నుంచి కొవ్వూరు వెళ్లేవారిని దారిలో అడ్డగించి దురుసుగా ప్రవర్తించిన సందర్భాలు గతంలో ఉన్నాయి. ఇటుగా ప్రయాణమంటేనే ప్రజలు భయపడుతున్నారు. ఈ గంజాయి మత్తులోకి యువతను లాగేందుకు ప్రయత్నిస్తున్నారు. గంజాయి విక్రయాలకు పూర్తి స్థాయిలో చెక్ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. డ్రోన్ కెమెరాల వినియోగంతో వీటికి అడ్డుకట్ట వేస్తామని పోలీసులు అంటున్నారు.

చోరీలు పెరిగాయి..



పోలీసులు ప్రజలకు రక్షణ కవచంలా ఉండాలి. గ్రామాల్లో చోరీలు, గంజాయి విక్రయాలు, బాలికలు, మహిళలపై వేధింపులు ఇటీవల కాలంలో బాగా పెరిగిపోయాయి. వాటిని అరికట్టాల్సిన అవసరం ఉంది. దొంగతనాల నిర్మూలనకు ప్రతి ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

– తోటకూర శ్రీనివాసరావు, ఉప సర్పంచ్, కొవ్వాడ

అనుమానం వస్తే దాడులు

ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తుల్లో చైతన్యం తీసుకువచ్చాం. ఇప్పటికే అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు పెట్టాం. కొవ్వూరు, కొవ్వాడ, మధురానగర్‌లో ఏర్పాటు చేయాల్సి ఉంది. మధురానగర్, ఎస్.అచ్యుతాపురం తదితర చోట్ల నిర్మానుష్య ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టాం. అనుమానం వస్తే దాడులు నిర్వహిస్తున్నాం.

– ఎం.వీరబాబు, ఎస్సై, ఇంద్రపాలెం

మండల వ్యవసాయాధికారిగా సత్య



ఇమ్మిడిశెట్టి సత్య

కరప: స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం మండల వ్యవసాయాధికారిగా ఇమ్మిడిశెట్టి సత్య బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా కరప ఎంఏఓగా పనిచేస్తున్న ఏవీ రాజేష్ పిఠాపురం సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కార్యాలయానికి వ్యవసాయ అధికారిగా బదిలీ అయ్యారు. సామర్లకోట మండల వ్యవసాయాధికారిగా పనిచేస్తున్న సత్య కరప మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సాగు మెళకువలు వివరిస్తూ తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించేందుకు సిబ్బందితో కలసి పని చేస్తామన్నారు. ప్రభుత్వ పథకాలు, యాంత్రీకరణ, ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు.

కిషోర్‌కు పీహెచ్‌డీ ప్రదానం



కిషోర్ పట్నాల

బాలాజీచెరువు: కిర్లోస్కర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో లైబ్రేరియన్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్‌కే కిషోర్ పట్నాల ద్రవిడ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పొందారు. ఎస్ ఎవాల్యుయేషన్ ఆఫ్ అండ్ ఏ మోడల్ ఫర్ ఏపీ ఆన్‌లైన్ అంశంపై చేసిన పరిశోధనకు ఆంధ్రా యూనివర్సిటీ లైబ్రేరియన్ ఇన్ఫర్మేషన్ సైన్స్ ప్రొఫెసర్ ఎం.సత్యనారాయణ గైడ్‌గా వ్యవహరించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

కొత్తపల్లి: ప్రతి ఒక్కరికి సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరమని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్వేత అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సీజన్‌లో జ్వరం, వాంతులు, విరోచనాలు వంటివి ఎక్కువగా వస్తాయన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల వద్ద దోమలు విజృంభించకుండా చర్యలు తీసుకోవాలని, దోమ తెరలు వాడాలని అన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, వేడి ఆహార పదార్థాలను భుజించాలన్నారు. అనారోగ్యంగా ఉంటే ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం పొందాలని ఆమె సూచించారు.

చిన్నారులకు సర్టిఫికెట్ల అందజేత



తైక్వాండోలో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలు అందజేసిన నిర్వాహకులు

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్ వద్ద బోట్‌క్లబ్ ఉద్యానవనంలో తైక్వాండోలో శిక్షణ పొందిన చిన్నారులకు సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలను సోమవారం అందజేశారు. తైక్వాండో శిక్షకుడు సతీష్ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో శిక్షణ అందించారు. సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మెడికల్ ఎడ్యుకేషన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎం.రాఘవేంద్రరావు మాట్లాడుతూ అపాయం ఎదురైతే సునాయాసంగా ఎదుర్కొనేందుకు తైక్వాండో దోహదపడుతుందన్నారు. ఈ శిక్షణతో బాలల్లో జ్ఞాపకశక్తి పెరగడంతో పాటు మనోధైర్యం లభిస్తుందన్నారు. శిక్షకుడు సతీష్ మాట్లాడుతూ ఇటీవల తెనాలిలో జరిగిన పోటీల్లో తమ పరిమళ తైక్వాండో ఆధ్వర్యంలో పాల్గొన్న 20 మందిలో 13 మంది స్వర్ణ, నలుగురు రజిత, ముగ్గురు కాంస్య పతకాలు అందుకున్నారన్నారు. ఇందులో 15 మందికి బ్లాక్ బెల్ట్ లభించిందన్నారు. కార్యక్రమంలో వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్, కార్యదర్శి దాసరి శ్రీధర్, కె.రామరాజు, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

భగవాన్ నామస్మరణతో ముక్తి

బోట్‌క్లబ్: కలియుగంలో భగవాన్ నామస్మరణతో ముక్తిని పొందవచ్చని ఉడిపి శిరూర్ మఠ పీఠాధిపతులు వేదవర్ధన తీర్థ స్వామీజీ అన్నారు. సోమవారం స్థానిక రామారావుపేటలో మధ్వసభ కమిటీ ఆధ్వర్యంలో స్వామీజీకి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఉడిపి క్షేత్రంలో శ్రీకృష్ణ పరమాత్మను పూజించే కార్యక్రమం రెండేళ్ల నుంచి తమ ఆధ్వర్యంలో జరుగుతోందని, అందరూ పాల్గొని భగవంతుని అనుగ్రహం పొందాలని స్వామీజీ అన్నారు. మధ్వాచార్యుల పరంపరలోని వచ్చిన అష్ట మఠ పీఠాధిపతులంతా రెండేళ్ల పాటు ఈ పవిత్ర ఆధ్యాత్మిక ఉత్సవాన్ని భక్తిభావంతో నిర్వహించే సంప్రదాయంగా వస్తోందన్నారు. తాము తొలిసారిగా ఈ కార్యక్రమం చేపడుతున్నామని స్వామీజీ అన్నారు. 750 ఏళ్ల చరిత్ర కలిగిన గురువు మధ్వాచార్యులు చూపిన మార్గంలో తామంతా ముందుకు సాగుతున్నామని అన్నారు. మధ్వమతంలో జన్మించడం పూర్వజన్మ సుకృతంగా అందరూ భావించాలని స్వామీజీ తెలిపారు. నిత్యం క్రమం తప్పకుండా దైనందిన కార్యక్రమాలు నిర్వహిస్తూ జన్మ సార్థకత చేసుకోవాలని చెప్పారు. కాకినాడ మధ్వసభ ఆధ్యాత్మిక చరిత్రను కమిటీ పూర్వపు కార్యదర్శి డాక్టర్ సుసర్ల వెంకటరమణ వివరించారు. కార్యక్రమంలో లోక రాఘవేంద్రరావు పన్యాల బుజ్జి, కాకవరపు విజయ్, గోవిందరావు, కల్యాణం రాఘవేంద్రరావు, పరుశు రామాచార్యులు పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ బుల్లికృష్ణవేణి

కరప: మండలంలో ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ సోమవారంతో ముగిసిందని ఎంఈఓ-1 కె.బుల్లికృష్ణవేణి తెలిపారు. ఇతర మండలాల నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చిన వారికి, మండల పరిధిలో ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 163 మంది, ఉన్నత పాఠశాలల్లో 152 మంది ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ఇందులో 125 మందికి బదిలీలు జరిగాయన్నారు. కొత్తగా 28 పోస్టులు వచ్చాయని, వారిని మోడల్ ప్రైమరీ స్కూళ్లలో ఎస్జీటీలు, హెచ్ఎంలుగా సర్దుబాటు చేశామన్నారు. స్కూల్ అసిస్టెంట్‌లుగా 35 మంది ఉపాధ్యాయులకు బదిలీలు జరిగాయన్నారు. ఈ సందర్భంగా మండల ఉపాధ్యాయులతో మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈఓ కృష్ణవేణి సమావేశమై విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, శానిటేషన్ తదితర విషయాలపై చర్చించారు. క్రమశిక్షణతో విద్యాబోధన చేసి మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి మధ్యాహ్న భోజన పథకానికి సన్నబియ్యం సరఫరా చేస్తున్నారని ఎంఈఓ తెలిపారు.

భవన నిర్మాణ బోర్డును పటిష్టం చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

బోట్‌క్లబ్: అన్ని కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ భవన నిర్మాణ బోర్డును పటిష్టం చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రభుత్వాలు వాడుకున్న బోర్డు నిధులను తిరిగి జమ చేయాలని ఐఎఫ్‌టీయూ (ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్) ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మిక సంక్షేమం కోసం ఖర్చు పెట్టాల్సిన బోర్డు నిధులను ప్రభుత్వాలు తమ అవసరాలకు వాడుకోవడం దారుణమన్నారు. బోర్డు నిధుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్క రూపాయి కూడా జమ చేయలేదని, కార్మికుల సంక్షేమం కోసం వసూలు చేసిన సెస్ డబ్బులే బోర్డులో ఉన్నాయన్నారు. ఆ నిధులు కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు పెట్టాలని, బోర్డు నిధులు వాడుకున్న ప్రభుత్వాలు బోర్డుకు తిరిగి జమ చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదని అన్నారు. 2024 ఎన్నికల్లో కూటమి నేతలు చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్‌లు భవన నిర్మాణ బోర్డును పటిష్ట పరుస్తామని, క్లెయిమ్‌లు మంజూరు చేస్తామని, సంక్షేమ పథకాలు కొనసాగిస్తామని, భవన నిర్మాణ రంగాన్ని పరుగులు పెట్టిస్తామని, అందరికీ ఉచిత ఇసుకను అందిస్తామని హామీ ఇచ్చి సంవత్సరం దాటుతున్నా ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఉచిత ఇసుక లేక పోగా కూటమి నేతల చేతుల్లో ఇసుక బందీ అయ్యిందని, ఖరీదైన సరకుగా మారిపోయిందని అన్నారు. దీంతో భవన నిర్మాణ రంగ కార్మికులకు ఉపాధి దూరమై ఇబ్బంది పడాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కోశాధికారి జి.ఆదినారాయణమూర్తి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.ఏసు, వివిధ సంఘాల నాయకులు ఆర్.రాఘవులు, గంటా బాలరాజు, గణేశుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అన్ని భాషలపై అవగాహన పెంచుకోవాలి



తమిళ భాషపై అవగాహన కల్పిస్తున్న డీవైఈఓ వెంకటేశ్వరరావు

సామర్లకోట: జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రతి విద్యార్థి మాతృ భాష తెలుగు, జాతీయ భాష హిందీ, అంతర్జాతీయ భాష ఇంగ్లిష్‌తో పాటు మరో భాష నేర్చుకోవడంపై దృష్టి సారించాలని డీవైఈఓ నాయుడు వెంకటేశ్వరరావు అన్నారు. ఎన్‌సీఈఆర్‌టీ సూచనల మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో విద్యా శాఖ ఆధ్వర్యంలో తమిళం నేర్చుకొందాం అనే కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుభాషా ప్రావీణ్యంతో వ్యక్తిగత ప్రయోజనంతో పాటు జాతీయ సమైక్యతా భావం ఏర్పడుతుందన్నారు. ఆయా భాషల సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన ఏర్పడుతుందని చెప్పారు. అన్ని భాషలు రావడం వల్ల ఎక్కడికైనా వెళ్లి సులభంగా ఉన్నత చదువులు చదువుకోవడంతో పాటు ఉద్యోగ అవకాశాలు పొందడానికి వీలు కలుగుతుందని చెప్పారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు కె.సత్యనారాయణ తమిళ భాష నేర్చుకోవడంలో మెళకులను తెలిపారు. ఈ కార్యక్రమానికి హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షత వహిస్తూ ఉత్సాహం ఉన్న 60 మంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి వారం రోజుల పాటు తమిళ భాషపై శిక్షణ ఇస్తారన్నారు. హైస్కూల్ హెచ్ఎంలు టి.శ్యామ్‌సుందర్, శ్రీదేవి, ఉపాధ్యాయులు కె.గంగాభవానీ, ఎస్.హరినాథ్, పీడీపీ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు



పావని (ఫైల్)

కాకినాడ రూరల్: మండలంలోని చీడిగ గ్రామానికి చెందిన బాలిక పావని (10) అదృశ్యంపై ఇంద్రపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై వీరబాబు కథనం ప్రకారం.. చీడిగ హైవే రోడ్డు పక్కన రైతు భరోసా కేంద్రం సమీపంలో కొత్త కాలనీకి చెందిన పావని సోమవారం ఉదయం 9.30 సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సుమారు మూడున్నర అడుగుల ఎత్తు, తెలుపు రంగు ఛాయ కలిగిన పావని ఆచూకీ తెలిస్తే సెల్ నంబరు 94407 96555కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు. గతంలో ఇంటి నుంచి మూడు సార్లు పావని వెళ్లినట్టు కుటుంబ సభ్యులు తెలిపారని, ఆమె కోసం బంధువులతో పాటు గ్రామంలో వెతుకుతున్నట్టు ఆయన చెప్పారు.

నేత్రపర్వంగా మల్లికార్జున స్వామి కల్యాణం



భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి కల్యాణం చేస్తున్న లక్ష్మణరావు దంపతులు

సామర్లకోట: నవర గ్రామంలో వేంచేసి భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం సోమవారం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపకుడు, సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దమ్మాల లక్ష్మణరావు, వీరనాగమణి దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. స్వామివారి కల్యాణం తిలకించడానికి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. కల్యాణాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్తు దీపాలు, పూలతో అలంకరించారు. పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఎంతో మహిమ కలిగిన స్వామివారిని దర్శించుకోవడం ద్వారా కోరిన కోర్కెలు నెరవేరుతాయన్నారు. కల్యాణం అనంతరం 200 మంది మహిళలకు లక్ష్మణరావు దంపతులు చీరలు పంపిణీ చేశారు.

జంక్షన్... టెన్షన్

- దివిలిలో ట్రాఫిక్ ఇబ్బందులు
- కలగా రోడ్డు విస్తరణ పనులు
- గంటల తరబడి నిలిచిపోతున్న వాహనాలు



దివిలిలో రాత్రి వేళ నిలిచిపోయిన వాహనాలు

పెద్దాపురం: బండి ఆగితే.. ముందుకు సాగదు. గంటల తరబడి వేచి ఉండాల్సిందే. ఇరుకిరుకైన రోడ్లు, ఆపై ప్రధాన జంక్షన్ కావడంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. సామర్లకోట – ప్రత్తిపాడు రహదారిలో దివిలి జంక్షన్‌లో పరిస్థితి ఇది. ఇక్కడ ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో ట్రాఫిక్ ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. విద్య, వ్యాపారపరంగా అభివృద్ధి చెందిన దివిలి, చంద్రమాంపల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారి తరచూ ట్రాఫిక్ వలయంలో చిక్కుకుంటోంది. ఉదయాన్నే పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులు, అలాగే ఉద్యోగులు, ప్రజలు ఇదే జంక్షన్ నుంచి వెళ్తుంటారు. రోజూ ఇక్కడ ట్రాఫిక్ వలయంలో చిక్కుకుంటున్నారు. ఈ సమస్యపై ఏళ్ల తరబడి ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో రహదారి విస్తరణకు మార్కింగ్ చేసినా ఎందుకో అటకెక్కించారు. అటు రోడ్డు విస్తరణ ప్రారంభం కాక, ఇటు ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ముందుకెళ్లి.. ఆపై ఆగి

గత టీడీపీ హయాంలో రోడ్డు విస్తరణ పనులకు ఆయా దుకాణాల తొలగింపునకు మార్కింగ్ ఇచ్చారు. ఆ దిశగా అధికార యంత్రాంగం ముందుకు వెళ్లినా తర్వాత అర్ధాంతరంగా ఆగిపోయింది. రోడ్డు విస్తరణ చేపడుతున్నారని ప్రజలు సంబరపడిన రెండు రోజులకే ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఫలితంగా నిత్యం ట్రాఫిక్ రద్దీ ఎక్కడా తగ్గడం లేదు. దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంద్రమాంపల్లి గ్రామ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా దుకాణాల తొలగింపునకు మార్కింగ్ ఇచ్చారు. ఇక్కడి వరకూ బాగానే ఉంది. అయితే ఇక్కడ దుకాణాలను తొలగించకపోగా, వ్యాపారులు మరింత ముందుకు రావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు, పాలకులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

హామీ తప్ప ఆచరణ శూన్యం



దివిలి ప్రధాన రహదారి విస్తరణ పనులు చేపడతామని 2019లో అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే చినరాజప్ప హామీ ఇచ్చినా ఆచరణకు నోచుకోలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దుకాణదారులను వెనక్కి జరిగేలా పోలీస్ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినా రోడ్డు విస్తరణ జరగక నిత్యం ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

– వట్టికూటి రాజ్‌కుమార్, దివిలి

ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తాం..



దివిలి జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసు సిబ్బందిని నియమిస్తాం. రోజూ ట్రాఫిక్ పోలీసును ఏర్పాటు చేసి ట్రాఫిక్ నిలిచిపోకుండా చర్యలు తీసుకుంటున్నాం. రోడ్డు విస్తరణ పనులకు మిగిలిన శాఖాధికారులు ముందుకు వస్తే ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం.

– వి.మౌనిక, ఎస్ఐ, పెద్దాపురం